# కోటిబాబు 'తోడ'ల్లుడు

## పి. చంద్రశేఖర అజాద్

"అయ్యా, మా సీనియర్ అసిస్టెంట్‌గారు ఈ రోజు 'మావ'గారింటి మండి వస్తారమకుంటాను" అన్నాడు వెంకటేశ్వర్లు వినయంగా.

"అవునవును" అన్నారంతా.

ఆ సీనియర్ అసిస్టెంట్‌గారి పేరు కోటేశ్వరరావు. కొంతమంది ముద్దుగా 'కోటిబాబు' అంటారు. ఇంకొందరు 'కోట్లు' అంటారు సరదాగా. వెంకటేశ్వర్లు కోపం వచ్చినప్పుడు మాత్రం రహస్యంగా 'కోటిగాడు' అనుకుంటాడు.

రెండో శనివారం, ఆదివారం వచ్చిందంటే కోటిబాబు 'మావ'గారింటికెళ్తాడు. కొన్ని సందర్భాల్లో సతీసమేతంగానూ, మరికొన్ని సమయాల్లో సతీ పుత్రికా సమేతంగానూ వెళ్తాడు. అది వెళ్లటం కాదు "వాలటం" అంటారు కొలీగ్స్.

అతనికింద నలుగురు జూనియర్ అసిస్టెంటులూ, ఓ అటెండరూ, అతని మీద ఓ ఎకౌంట్స్ ఆఫీసరూ, ఇంకో మేనేజరూ పనిచేస్తారు.

కోటిబాబు ముఖం ప్రత్యేకమైంది. చలి గజగజవణికిస్తున్నప్పుడు ఆ ముఖంలో చెమటలు కనిపిస్తాయి. ఆ చెమటలోని విశేషం అందులో 'జిడ్డు' మిళితమై వుండటం. అతను ఎల్లప్పుడూ విదేశీ పౌడర్‌నే, అందులోనూ శాండల్‌ది వాడతాడు. అయిదు నిముషాల తర్వాత బావిలో జల వూరినట్లు ఆయిల్ ఉబుకుతుంది.

"గ్యాస్ సంగతి తెలియదుగాని ఆయిల్ మాత్రం ఒరిజినల్. మనవాళ్లు అనవసరంగా కోట్లాది రూపాయలు తగలేస్తున్నారుగానీ కోటిబాబులాంటివారినో కోటిమందిని చూసుకుని పాములకి విషం పిండినట్లు ఆయిల్ పిండటం నేర్చుకుంటే లోటు బడ్జెట్ వుండదు" అంటాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు సన్నగా వుంటాడు. అయినా వినయంగానే వుంటాడు. కోటిబాబు ఇమ్మిడియేట్ జూనియర్ అసిస్టెంట్ తనే. అందుకే వారేం చెప్పినా వినాలి.

కోటిబాబు ప్రాథమిక కోర్కెల్లో ఒకటి అయిదు లక్షలకి అధికారి కావాలి. అంత కనీస మొత్తానికి వాళ్ల బాబు అనగా నాన్నగారు ఎలా అడ్డుపడ్డారో ఓసారిలా చెప్పాడు.

"అవునయ్యా మా బాబు సరిగ్గా వుంటే నేను రాజానే. డబ్బంతా తాగి తగలేశాడు. కొంపల చుట్టూ తిరిగాడు. నాకు మాత్రం కోటేశ్వరరావు అని పేరు పెట్టాడు. దాంతో తృప్తిపడటమే"

"అలా ఎందుకు చేశాడు సార్" అన్నాడు వెంకటేశ్వర్లు

"వికాస్ ఐ యామ్ ఓన్లీ ది సన్. ఎలా వుంది నా ఇంగ్లీష్"

"సూపర్బ్ సార్"

"మన డ్రాఫ్టింగ్ సంగతి నీకు తెలియదు. మనం నోట్ రాస్తే మేనేజర్‌కి తల తిరిగిపోవటమే. మొన్న రూమ్‌లో కూర్చోబెట్టుకుని వెరీగుడ్ డ్రాఫ్టింగ్ అంటూ ఇలా... అని భుజం తట్టబోయాడు.

"వద్దొదిలేయండి సార్ ఒక్క ప్రాణిని" వినయంగా వెనక్కి జరిగాడు. అప్పుడు 'రావ్' కళ్లల్లో మెరుపులు. చొక్కా చేతులు వెనక్కి మడిచి కండలు పెంచి 'సీ మిస్టర్ వెంకటేశ్వర్లూ - దిసీజ్ మై బాడీ మేడ్ విత్ స్టీల్" అన్నాడు.

"అదిరిపోయింది సార్"

"ఏమిటి?"

"డ్రాఫ్టింగ్"

"అంటే నా కండలు నచ్చలేదా?"

"ఎంతమాట సార్. విశాఖ ఉక్కు మీ శరీరం"

"నో. అది ఈనాటిది. మనది భిలాయ్ ఉక్కు. ఐయామ్ నాట్ జోకింగ్. సింపుల్‌గా నిన్ను వంగదీసి ఓ గుద్దు వేశాననుకో. జీవితంలో మరిచిపోవు"

"చాల్లేండి. నాలాంటివాడి మీద కాదు సార్ ప్రతాపం. ఫ్రీ స్టైయిల్ రెజ్లింగ్ చేయాలి మీరు. నాకు తెలియకడుగుతాను. మీరూ నేనూ ఒకే రకం తిండి తింటున్నాం కదా. ఈ తేడాలేమిటి సార్."

వెంకటేశ్వర్లు కావాలనే అలా రెచ్చగొడతాడు.

ఆ తర్వాత మొత్తం ఆఫీస్‌లో అందరికీ ఆ వారం కాలక్షేపం అదే. మొదట్లో సరదాగానే అనిపించిందిగాని, రానురాను 'కోటి'ని భరించటం కష్టమైపోతోంది. మిగతావారి విషయం వేరు. వారందరు 'ఏ.ఓ.'గారికో, మేనేజర్‌గారికో జవాబు చెప్పుకుంటారు. తనకిచ్చిన ఆఫీస్ ఆర్డర్‌లో నువ్వు మిస్టర్ రావ్ పర్యవేక్షణలో పనిచేయవలెను అని క్లియర్‌గా వుంది వెంకటేశ్వర్లుకి.

కోటిబాబు మంచివాడే. కాకపోతే తానో కారణజన్ముడనని నమ్మకం. తనేం చేసినా తనకే అద్భుతంగా వుంటుంది.

ఉదయం ఆఫీస్‌కి సైకిల్ మీద వస్తాడు. ఆ ముఖంలో ఏ కాలంలోనూ ముత్యాల్లా మెరిసే నీటిబిందువులు. వాటి నిండా పేరు తెలియని ఆయిల్ కంటెంట్.

"వెంకటేశ్వర్లూ ఇది మామూలు సైకిల్ కాదు. హంబర్. బీస్ సాల్ కింద కొన్నాం. అంటే తెలుసా?"

"తెలుసు సార్."

"ఇరవై సంవత్సరాల క్రితం కొన్నాం. చేతక్ స్కూటర్ పనికొస్తుందా...నో"

"అవును సార్. మీరే కొన్నారా?"

"నో... దిసీజ్ ది ప్రెజెంటేషన్ ఫ్రమ్ మై అంకుల్"

"బాగుంది సార్"

"ఇంతకూ నా వయసెంతో తెలుసా?"

"ఎంత సార్. ముప్పై అయిదుంటాయా?"

"నాశావా... దటీజ్ మై ఫిజిక్. పార్టీ సెవెన్లో పుట్టాను. అప్పుడే ఇండియా లిబరేట్ అయింది."

అక్కడ నుండి కోటిబాబు జ్ఞాపకాల్లోకి జారిపోతాడు.

వాటి సారాంశం ఇది.

కోటిబాబుకో మేనత్త వుంది. ఇప్పుడు కూడా వుండే వుంటుంది. ఆవిడకో అమ్మాయి. ఆ అమ్మాయి ఎంత అందగత్తెనో తనే చెప్పలేదు. నిచే ఛార్మింగ్ ఫేస్. కలరా వైట్ చాప్.


CHANDRA



> “మావాడి పవర్ గురించి చెబుతున్నా. సి.ఐ గారే కాదు ఆడి కింద పెద్ద గుండాలున్నారు. నాకయితే సంవత్సరానికి అర డజను బనీన్లు, డ్రాయర్లు కొంటాడు. ప్రతి పండక్కి బట్టలు పెడతాడు. ఈ కాలంలో అలాటి బామ్మర్దులున్నారా?”

వాళ్ళ వెనకాల లక్షల్లక్షల రూపాయలున్నాయి. ఆ అమ్మాయి పి.జి. చేసింది.

కోటిబాబు పి.యు.సి. మాత్రమే పాసయినా, తన వెనకాల వీపు మాత్రమే వున్నా అత్తయ్యగారమ్మాయిని చేసుకోవటానికి మహా ఉత్సాహపడిపోయాడు.

వెంకటేశ్వర్లు కథనం ప్రకారం ఆ అమ్మాయి కోటిబాబు కండల్నీ, ముఖంలో ఆయిల్‌నీ చూసి గడగడలాడుంటుంది. ఆ కాలంలో ‘జిడ్డు’ ముఖాలవారి కోసం ప్రత్యేకంగా సబ్బులు కనిపెట్టకపోవడం కోటిబాబు దురదృష్టమే.

అలా ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

“అవునోయ్ వెంకటేశ్వర్లూ, బిలీవిట్ ఆర్ నాట్. షీ ఈజ్ వోన్లీ ది డాటర్. మా మావయ్య బుర్ర నిండా తెలివితేటలు. ఆ లక్షలు కోట్లు అయ్యేవి. మినిమమ్ టూ క్రోర్స్. వాటే బాడ్‌లక్” అని చాలాసేపు దిగులుపడిపోయేడు.

ఇంకొంచెం ముందుకువెళ్తే –

“వెంకటేశ్వర్లూ నాకో ‘కోటు’ కుట్టించుకోవాలనుందోయ్” అన్నాడోసారి.

“బాగుంది సార్”

“ఎక్కడయ్యా ఇంకా కుట్టించుకోందే”

“భలే వారు సార్. కోటు కుట్టించి తమరు తొడుక్కున్నాక బాగుందని నేను చెప్పటం ఏమిటి, గుడ్డిమాలక్ష్మి తడివిచూసి బాగుందంటుంది. నాలాంటివాడికి కోటు ఛండాలంగా వుంటుందిగాని, మీకు అదరిపోదా!”

“మరేంటనుకున్నావ్. చిన్నప్పటి ఫోటో వుందయ్యా. అందులో కోటూ, టై కట్టాను. ఏం బ్రైట్‌నెస్‌లే. ఆల్బంలో వుంది. మా ఇంటికి రా చూపిస్తా. ఈ రోజుకీ మనమంటే ఎంత గౌరవమనుకున్నావ్?”

“ఎవరికి సార్?”

“మా మావగారింట్లో”

“నిజమా సార్”

“ఇప్పటికీ కొత్త పెళ్ళికొడుకుని చూసినట్లు చూస్తారు”

ఆ కథనం ఇది.

కోటిబాబుకి మేనత్తగారమ్మాయిని చేసుకోవటం కుదరకపోవటంతో కనీసం ఒకే అమ్మాయున్న మావగారిని చూడాలనుకున్నాడు. అదీ కుదరలేదు. ఇద్దరు ఆడపిల్లలూ, ఓ మగాడూ వున్న మావగారే దొరికాడు.

అదృష్టం ఏమిటంటే మావగారికి హార్టాఫ్ ది సిటీ సెంటర్‌లో పెద్ద బిల్డింగ్ ఉంది. దాన్ని ముక్కలు చేసి అమ్మినా, షాపింగ్ కాంప్లెక్స్ కట్టినా హాయిగా కాలం గడుస్తుంది. ఇదివరకయితే అది మామూలు బిల్డింగే. ఇప్పుడా సెంటర్ అంత పెరిగిపోయింది.

వెంకటేశ్వర్లు అభిప్రాయం ప్రకారం హంబర్ సైకిలూ, వాచీ, ఉంగరం, నాలుగు జతల బట్టల్తో కోటిబాబుని వాళ్ళ మావ కొనేసుంటాడు.

కోటిబాబు వివాహం జరిగి రెండు దశాబ్దాలు పైబడ్డాయి. వాళ్ళ మావగారూ పరమపదించారు. ఇటీవల కాలంలో బామ్మర్ది బాగా సంపాదిస్తున్నాడు. అతనికి ఇంకా పెద్ద కండలున్నాయి. ముఖంలో పెద్ద పెద్ద మీసాలున్నాయి. అతనికి తెలియని పోలీస్ ఆఫీసర్ లేదు.

కోటేశ్వరరావు ఈ వుద్యోగంలో చేరబట్టిగాని లేకుంటే ‘తోడల్లుడి’లా వారింట్లోనే వుండిపోయేవాడు. అతనేం చేస్తాడోగాని ఆ బిల్డింగ్‌లోనే వుంటాడు. భోజనాలు మాత్రం సెపరేట్.

కోటిబాబింకా రానే లేదు. అందరికీ కొంచెం ఆరాటంగానే వుంది. అందులోనూ చేయాల్సిన పనులు లేవు. పేపర్ చదివేశారు. ఆఫీస్ వారిచ్చే ‘టీ’ తాగారు. ఇంక కోటిబాబు వస్తే ‘లంచ్’దాకా కాలక్షేపం.

***

అరగంట తర్వాత –

ఆఫీస్ బయట బండి ఆగిన శబ్దం

మరో రెండు నిముషాల తర్వాత చెమటల్తో కోటిబాబు వచ్చాడు

“సరాసరి మా బావమరిది ఇంటి నుండి వస్తున్నానయ్యా” అన్నాడు వాకిట్లోనుంచే.

వెంకటేశ్వర్లు కొలీగ్స్‌కి కన్నుగీటాడు.

“మావాడే. బులెట్ మీద వచ్చాం. ఎయిటీ చాలంటే వినడు. వంద కె.ఎమ్.పిహెచ్. అరగంటలో వచ్చాం.”

“అందుకేనా సార్ చెమటలు”

“మరేంటనుకున్నావ్. నువ్వయితే గుండాగి ఛస్తావ్. ముందా గాలికి సీట్ నుండి ఎగిరిపడతావ్.”

అందరూ బిగ్గరగా నవ్వారు.

“అయితే భోజన విశేషాలు బాగుండాలే” అన్నాడు వెంకటేశ్వర్లు.

“బాగుండటమా... భలేవాడివే. ఆగు” అని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి వచ్చాడు.

"మా బావమరిది వూరు దగ్గర్లో లాకులు న్నాయి. వాటి దగ్గర వలలు కడతారు. బుల్లెట్ మీద వెళ్ళాం. కూర్చోండి సార్ ఏదొకటి పడు తుందిస్తామన్నారు. నువ్వు నమ్మవు. మేం మాట్లా డుకుంటున్నాం. అలా ఎగిరి పడిందో చేప. జస్ట్ టెన్ కిలోస్."

"పది కిలోలా!" నోరు తెరిచాడు వెంకటేశ్వర్లు.

"వీడెవడండి బాబూ! ఒక్కో తిమింగలం మనూ రంతుంటుంది. కొడితే ఓడలు గల్లంతే."

"అది సరేసార్. ఇంతకూ అది తీసుకున్నారా?"

"మా బావమరిది తీసుకుంటానని కూర్చు న్నాడు. నేనే వద్దన్నా. వాడికో పిల్లాడు. మా అత్తగారూ, వాడి భార్య, మేమిద్దరం. మా నలుగురికీ అంత పెద్ద దెందుకు. అదేమన్నా మిలట్రీ హోటలా?" అని బిగ్గరగా నవ్వేడు.

"అదేంటి సార్. మీ తోడల్లుడు వాళ్ళున్నా రుగా."

"వాడూ మా బావమరిది మాట్లాడుకోరు"

"ఎందుకని సార్?"

"దానికో లిటిగేషనుంది. తర్వాత చెబుతాగా" అన్నాడు విసుగ్గా.

"సార్! మీ తోడల్లుడి బాడీ కూడా మేడ్ విత్ స్టీలా?"

"ఛ... ఛ... నీలానే వుంటాడయ్యా. ది మోస్ట్ డేంజరస్ ఫెలో. మనం చూడు. ప్లెయిన్‌గా వుంటాం. రెండు వందల రూపాయిల చేప అన వసరం అన్నాను. తర్వాతనిపించిందయ్యా తింటే అలాంటిదాన్ని తినాలి. అందులోనూ 'కృష్ణ'లో పడిన చేప. మహా రుచిగా వుంటుంది"

"ఇంతకూ అసలు విషయం..."

"వస్తన్నా. ఆ చేపలతను మీరు మాట్లాడు తుండండి. ఏదొకటి పడుతుంది అన్నాడు. సరేనన్నాం. పావుగంట గడిచింది. బావా వెళ్దాం అన్నాడు. రెండు కిలోలు మటన్‌గాని, చికెన్‌గానీ తీసుకెళ్ళి వేపించుకుందాం అన్నాడు. నేను సరేననబోతున్నా, యు బిలీవిట్ ఆర్ నాట్ రాఘవేంద్రరావు సినిమాలోలా అలా ఎగిరొచ్చి పడింది ఆఫ్ త్రీ కిలోస్... వాటే..."

"బాగుంది సార్"

"వాడూ అదే అంటాడు. సార్ ఈ రోజు మీ పాదం పెట్టారు. నా అదృష్టం పండింది. మీరింకో గంట కూర్చోండి అని. మనకది రాసిపెట్టుంది. వస్తున్నామా, బులెట్ మార్కెట్‌లోకి తిప్పాడు. కొత్తిమీర కోసమనుకున్నా. నన్ను బండి దగ్గర నిలబెట్టి పది నిముషాల తర్వాత వచ్చాడు. చూడూ భోజనంలో రొయ్యల వేపుడూ, క్రాబ్స్ పులుసూ..."

"క్రాబ్సా...!"

"అవునోయ్. పీతల పులుసు. ఇంకా చేప. తినలేక చచ్చాను. నిన్న రాత్రీ, ఉదయం దోసెల్లో కూడా... వాడితో చాలా కష్టమయ్యా"

వెంకటేశ్వర్లు అసూయగా చూశాడు.

"జాతకమంటే మీది సార్. మీ పేరు మండి, శరీరం మండి వాటే లక్ సార్. పెళ్ళయిన రెండో సంవత్సరం వస్తే చాలు మావగారింట్లో ఉప్మానే టిఫిన్. ఇన్ని సంవత్సరాలు వచ్చినా, మీ మావగారు పోయినా మీవాడి ట్రెడిషన్... ఓహ్... చాలా అద్భుతం."

"సొంతం వినవయ్యా స్వామి. నిన్న సాయం కాలం సి.ఐ. దగ్గరికి వెళ్ళాం. బండిమీదే. మావాడ్ని చూడగానే సీటులోంచి లేచొచ్చాడు. రాత్రికి భోజనానికి రాకూడదూ అన్నాడు. అప్పుడే తలకాయలు పగలగొట్టుకున్న కేసు వచ్చింది. సారీ బాసూ అన్నాడు. అసలా సి.ఐ. మావాడితో కల్పి మందుకొడతాడు తెలుసా?"

"తెలియదండి. ఇప్పుడేగా చెబుతున్నారు"

"ఏం లేదు. నిన్ను బొక్కలో తోయించాల నుకో. నాకు అయిదు నిముషాల పని" అన్నాడు కోటేశ్వరరావు.

అందరూ నవ్వారు.

"అదేంటి సార్. ప్రమోషన్ ఇప్పిస్తాననో, ఇంక్రి మెంట్లు తెప్పిస్తాననో అనాలిగాని ఇదేమిటి?"

"మావాడి పవర్ గురించి చెబుతున్నా. సి.ఐ. గారే కాదు ఆడి కింద పెద్ద గూండాలున్నారు. నాకయితే సంవత్సరానికి అరడజను బనీన్లూ, డ్రాయర్లూ కొంటాడు. ప్రతి పండక్కీ మా అంద రికీ బట్టలు పెడతాడు. ఈ కాలంలో అలాంటి బామ్మర్దులున్నారా?"


ఈసారి అందరికీ నిజంగా అసూయ కలిగింది. ఇంకో రెండు సంవత్సరాల్లో కోటిబాబు మావగా మారబోతున్నాడు. మరి ఇదంతా అదృష్టం కాకే మిటి. కోటిబాబు మాటల్లో బడాయి కనిపించినా, నిజం ఎంతోకొంత వుంటుంది అనుకున్నారు.

వెంకటేశ్వర్లు ఆలోచనలు వేరే రకంగా వున్నాయి.

"లిటిగేషన్ వుందన్నాడు. ఇంతకీ తోడల్లుడి లిటిగేషన్ ఏమిటి?"

***

ఊర్లో అందరికీ కళ్ళు ఎర్రబడి మూడు



"వెంకటేశ్వర్లు కథనం ప్రకారం ఆ అమ్మాయి కోటి బాబు కండల్నీ, ముఖంలోని ఆయిల్‌ని చూసి గడగడలా డుకుంటుంది. ఆ కాలంలో 'జిడ్డు' ముఖాల వారి కోసం ప్రత్యేకంగా సబ్బులు కనిపెట్ట కపోవడం కోటిబాబు దుర దృష్టమే."

రోజులు బాధపెట్టాక తగ్గుతున్నాయి. కోటేశ్వర రావు వంతు అయ్యాకే వెంకటేశ్వర్లుకి వచ్చింది.

"ఏం మందులు వాడుతున్నావయ్యా" అన్నాడు కోటిబాబు.

"వేపకాయలున్నాయి. ఆ అయిట్‌మెంట్ వాడుతున్నాను".

"నేనది వాడను. డాక్టర్‌కి చూపించా. మొత్తం మాటేభై రూపాయలయింది"

"మావి పాపిష్టి కళ్లు సార్. మీవి దివ్యమైనవి. అందులోనూ మీరు సీనియర్ అసిస్టెంట్."

"నీకు మాత్రం తక్కువేంటయ్యా. పదెకరాల ఆసామివి"

"అందరూ వాడుతున్నారని వాడాను"

"సర్లే. ఇక్కడుండి అందరికీ అంటించటం ఎందుకు? ఇంటికి ఫో"

"మీరు వాకా 'లిటిగేషన్' గురించి చెప్పనే లేదు"

"ఏ లిటిగేషనయ్యా."

"అదే సార్. మీ తోడల్లుడిది."

"అదా. నీకు తెలుసుగా. తండ్రి ఆస్తిలో ఆడ పిల్లలకూ వాటా వస్తుంది. అందుకని ఆ ఇంటిలో వాకూ వాటా వస్తుందని తగాదా పడుతున్నాడు."

"ఆయనకు రావటం ఏమిటి? మీకు రాదా?"

"ఎందుకు రాదు. వస్తుంది."

"ఇద్దరూ కలసి పోట్లాడకపోయారా?"

"అది మన పద్ధతి కాదు. అయినా మా మావ ఇంతకు ముందు కట్నం ఇచ్చాడు. అయి పోయింది. తృప్తిపడాలి. ప్రతి సంవత్సరమూ పిలుస్తున్నాడు. బట్టలు పెడుతున్నాడు. ఇంటి కెళ్తే చేపలూ, మాంసాలూ ఏం కావాలంటే అది. తన కిష్టమయి ఇవ్వాలనుకుంటే ఇస్తాడు. దానికి తగాదాపడాలా! నా కిష్టం లేదు."

"అదేమిటి సార్. మీకు ఇద్దరూ ఆడపిల్లలే గదా."

"మా బావమరిదికి ఆ విషయం తెలుసు. అందుకే తనే ఇస్తాడు. నేనూ చస్తున్నా. ఆ ఇంటికి మంచి ధర వస్తుంది. మాట్లాడితే మాకూ వాటా రావాలి."


"నా మాట విని ఇద్దరూ కలసి కోర్టులో కేసు వేయండి సార్. సరిపోతుంది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"లేదు వెంకటేశ్వర్లూ. నేను మావాణ్ణి నమ్ము తున్నాను" అన్నాడు రావు.

వెంకటేశ్వర్లు ఇంటికెళ్ళిపోయాడు.

***

తనేం రాసినా, చేసినా, తిన్నా, కొన్నా అదో




విశేషంగా చెప్పి ఆనందించే కోటిబాబు, తన మాటలు వింటూ నవ్వుతున్నారో, వెక్కిరిస్తు న్నారో తెలుసుకోలేని కోటేశ్వరరావు – తనని రెచ్చగొట్టడానికి ఏదో ప్రశ్న అడుగుతున్నారనే విషయం మరిచిపోయి చెలరేగిపోయే సీనియర్ అసిస్టెంట్ మిస్టర్ రావ్ కొంతకాలంగా మౌనంగా వుంటున్నాడు.

శని, ఆదివారాలు మావగారింటికి వెళ్ళటం లేదు.

ముఖ్యంగా వారి బావమరిది గురించి మాట్లా డటం లేదు.

అందరికీ అనుమానం వచ్చి వెంకటేశ్వర్లుని ప్రశ్నించారు. అతను మొత్తం మీద విషయం తెలుసుకోగలిగాడు.

అందరూ చేరారు. వెంకటేశ్వర్లు మాట్లాడాడు కోటిబాబు మాటల్లో "మంచికి రోజులు లేవు వెంకటేశ్వర్లూ. మా బావమరిదిగాడు ఎంత పనిచేశాడో తెల్సా. ఈ ఇంటిలో ఎలాంటి భాగం నా కవసరం లేదు అని సంతకం పెట్టమన్నాడు. నేనూ, నా భార్య మాట్లాడకుండా పెట్టాం. మా తోడల్లుడికి డబ్బు ఇస్తానన్నాడు. అది అందాక మా వదినాగారు సంతకం పెట్టారు. వాడు మాకో సర్టిఫికెట్ ఇచ్చాడు. మా అక్కా, బావ మంచివాళ్ళు అని. వెనకటికి శ్రీరాముడు హను మంతుడికేం చేశాడో తెలుసా... లంకంతా తిరిగి... సీతమ్మని చూసి, లంకని తగలబెట్టి వుంగరం తీసుకొస్తే వాటేసుకుని హనుమా నీ జీవితం ధన్యమైంది ఫో అన్నాడంట. మా ఆవిడ గోల. ముందునుండీ మనం కూడా వాళ్ళలా వుంటే మనకీ వాటా వచ్చేది కదా అని. చేతులు కాలాక ఏం చేస్తాం చెప్పు."

అందరూ నిట్టూర్చారు.

"అప్పటికీ కొందరు పెద్దమనుషుల ముందు పెట్టాను. మా బావమరిదేం అన్నాడంటే వాళ్ళకి చాలా చేశాను. ఇంటికొచ్చినప్పుడల్లా చేపలూ మాంసాలూ, పీతలూ తిన్నారు. బట్టలు పెట్టాను. అవన్నీ లెక్కలు కడితే అంతే అవుతాయి అన్నాడు."

అందరూ బిగ్గరగా నవ్వారు.

అప్పుడు వెంకటేశ్వర్లు తన మాటల్లో చెప్పాడు.

"కోటిబాబు కెంత కండలున్నా. బాడీ ఖిలాడీ ఉక్కయినా – ఆయన బామ్మర్దిది డబుల్ స్టీల్ బాడీ. ఏరోప్లేన్లకి వాడతారే ఆ స్టీల్. కోటి బాబు ఎక్కువ మాట్లాడితే సి.ఐ.గార్కి చెప్పి విరుచుకుపడతాడు"

"పాపం కోటిబాబు" అన్నారెవరో.

వెంకటేశ్వర్లు ఆమోదించలేదు.

"ఇందులో పాపం ఏముంది. కోటిబాబు తోడల్లుడికి కండలు లేవు. ఆయన బాడీ ఉక్కు కాదు. వాడి ముఖంలో మీసాల్లేవు. వాలానే గాలికి కొట్టుకుపోతాడా అనిపిస్తాడు. అయినా కూడా వాడే గెలిచాడు. కోటిబాబు బామ్మర్దికి మీసాలున్నా, పోలీసులూ – గూండాలూ వున్నా, ఎంత డబ్బున్నా ఏం చేయలేకపోయాడు. కోటి బాబుకి కండలూ, ముఖంలో అయిలుందిగాని పోట్లాడటం చేతకాదు. అది చేతకాకపోయినా ఫర్లేదు. పూర్తిగా దిగజారిపోయేడు. అలా లొంగిపోయేవారు చేపల్తోనూ, క్రాప్స్‌తోనూ సరి పెట్టుకోవాల్సిందే."

"ఇంతకూ అవన్నా తిన్నాడా? మన ముందు కోతలేనా?" అన్నారెవరో.

"అదీ నిజమే. వాడు ఒకటి చేస్తే వంద చేసినట్లు చెబుతాడు. ఒకటి మాత్రం నిజం. ఇప్పటి వరకూ మనల్ని తిన్నాడు"

అందరూ నవ్వుతున్నారు.

కోటేశ్వరరావు అప్పుడే హంబర్ సైకిల్‌కి స్టాండ్ వేశాడు.

వెంకటేశ్వర్లు వినయంతో వణికాడు.